
సాక్షి
పల్నాడు

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



జ్ఞాన మందిరం వార్షికోత్సవం

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి జ్ఞాన మందిరంలో 16వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 516.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

సిద్ధమవుతున్న కాకాని ప్రభ



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు తరలివెళ్లేందుకు కాకాని నుంచి భారీ విద్యుత్ ప్రభ సిద్ధమవుతుంది. 13 సంవత్సరాలుగా కాకాని నుంచి భారీ విద్యుత్ ప్రభను గ్రామస్తులు కొండకు తరలిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటువుతున్న ఈ ప్రభ 75 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రభ తడిక నిర్మాణం పూర్తయింది. ప్రభను తరలించేందుకు ఉపయోగించే రథాన్ని సిద్ధం చేస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ కంచేటి వీరయ్య సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో ఇనుప రథాన్ని సమకూర్చారు. ప్రభను కొండకు తరలించేందుకు దాదాపు రూ.17 లక్షల ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు. మార్చి 5వ తేదీన ప్రభను రథంపై నిలబెట్టనున్నారు. 6వ తేదీ ప్రభ కొండకు బయలుదేరుతుంది. అదేరోజు రాత్రికి కొండకు చేరుకుంటుంది. రెండురోజుల పాటు ప్రభ కొండ వద్ద కొలువుదీరనుంది.

కలుషిత ఆహారం తిని బాలిక మృతి

– నిర్ధారించిన వైద్యులు

నెహ్రూనగర్: బిహార్ రాష్ట్రం నుంచి గుంటూరు నగరానికి వలస వచ్చిన కృష్ణబాబు కాలనీలో ఉంటున్న ఓ కుటుంబంలో సరిత అనేక బాలిక కలుషిత ఆహారం రెండు రోజుల కిందట మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సరిత ఎటువంటి కలుషిత తాగునీటి వల్ల మృతి చెందలేదని, ఎల్లో మీడియా తాగునీటి వల్లే మృతి చెందిందంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. కృష్ణబాబు కాలనీ ప్రాంతమంతా తాగునీటిలో ఫ్లోరిన్ శాతం పరిశీలించారు. సమపాళ్లలో ఉందని తేల్చారు.

పల్స్‌పోలియోపై తల్లిదండ్రులను చైతన్యపర్చాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ పల్స్‌పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ఐదేళ్లలోపు వయసు గల పిల్లలందరికీ మార్చి 3న పోలియో చుక్కలు వేయించే విధంగా డీవైఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈవో పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల అసెంబ్లీ సమయంలో విద్యార్థులకు ప్రాముఖ్యత తెలియజేసి, పాఠశాల యాజమాన్య, పేరెంట్స్ టీచర్స్ కమిటీలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జీరో నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించే విధంగా తల్లిదండ్రులను చైతన్యవర్చాలని తెలిపారు. మార్చి 3న ఆయా పాఠశాలల్లో వైద్యారోగ్యశాఖ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది వసతి ఏర్పాటు కోరితే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని సూచించారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు నంబరు 07783 విజయవాడ–గుంటూరు, 07788 గుంటూరు–విజయవాడ, 07779 గుంటూరు –మాచర్ల, 07465 గుంటూరు–విజయవాడ, 07786 గుంటూరు–రేపల్లె రైళ్లు ఈ నెల 27 నుంచి మార్చి 11వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

యార్డుకు 1,56,917 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,56,917 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,40,541 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,400 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,19,436 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

తిట్టిన వారికే టికెట్

సత్తెనపల్లి టీడీపీ టికెట్ కన్నాకు ప్రకటించడంతో భగ్గుమన్న విభేదాలు

- మరి ఇన్నాళ్లు జెండా మోసిన వారి పరిస్థితి ఏంటీ..?
- పార్టీ శ్రేణులతో మాజీ స్పీకర్ కోడెల తనయుడు శివరామ్ సమావేశం
- టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టించిన వారికి ప్రాధాన్యమా అంటూ విమర్శలు
- ఇండిపెండెంట్ అభ్యర్థిగా శివరామ్ పోటీ చేయాలని కార్యకర్తల ఒత్తిడి



సత్తెనపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశమైన కోడెల శివరామ్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఆ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కన్నా లక్ష్మీనారాయణను అభ్యర్థిగా అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో.. తెలుగుదేశం శ్రేణులంతా నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం టీడీపీ నాయకుడు, మాజీ స్పీకర్ తనయుడు డాక్టర్ కోడెల శివరామ్‌తో కార్యకర్తలు, నాయకులు సమావేశమయ్యారు. 'నియోజకవర్గ పార్టీ క్యాడర్ మొత్తం మీ వెంటే ఉంది.' అంటూ ఆయన ఎదుట స్పష్టం చేశారు. చంద్రబాబును ఏక వచనంతో దూషించి, గతంలో టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, జెండాలు మార్చిన కన్నా లక్ష్మీనారాయణకు టీడీపీ టికెట్ ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. పనిచేసే వారికి చోటులేకుండా పైరవీలు చేస్తూ పబ్బం గడుపుకునే వారికి టికెట్ ఇస్తే భవిష్యత్తులో పార్టీ మరింత నష్టపోయే ప్రమాదం ఉందని చర్చించారు. అధిష్టానం పునరాలోచన చేయకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేయాల్సిందేనని శివరామ్‌పై టీడీపీ కార్యకర్తలు ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం.

బెడిసికొట్టిన చంద్రబాబు 'క్రేజీ' వ్యూహం

సత్తెనపల్లి నియోజకవర్గంలో టీడీపీ బలం రోజురోజుకు తగ్గిపోతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. గత ఎన్నికల్లో టీడీపీ 20 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. అప్పటి నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఆ పార్టీ బలం తగ్గడమే కానీ, పుంజుకుంది లేదు. 2022 వరకు నియోజకవర్గంలో నేతల ఉనికి కూడా కనిపించలేదు. దీంతో వైఎస్సార్ సీపీని తట్టుకునే పరిస్థితి లేదని గ్రహించిన చంద్రబాబు టికెట్ కావాలని తనను ఎవరు సంప్రదించినా.. మీకే టికెట్ అంటూ ప్రోత్సహించారని, తద్వారా పార్టీకి క్రేజ్ తీసుకురావాలని వ్యూహం పన్నినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. డాక్టర్ కోడెల శివరామ్, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి), నాగౌతు శౌరయ్య పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. వీరందర్నీ పక్కన పెట్టి కన్నా లక్ష్మీనారాయణకు టికెట్ కేటాయించడంతో.. నియోజకవర్గ టీడీపీ శ్రేణులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. అతికొద్ది మంది కన్నాకు సహకరిస్తున్నప్పటికీ వారు కూడా గుంటూరు, పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు ఇక్కడకు వచ్చి పెత్తనం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీని నమ్ముకున్న కోడెల శివరామ్ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారనే నిర్ణయంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

నైరాశ్యంలో జనసేన

పొత్తులో భాగంగా సత్తెనపల్లి సీటు జనసేనకు ఖచ్చితంగా కేటాయిస్తారనే ఉద్దేశంతో ఆ పార్టీ నేత బొర్రా వెంకట అప్పారావు నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలి జాబితాలో జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కూడా కేటాయించక పోవడంతో ఆ పార్టీ శ్రేణులంతా నైరాశ్యంలోకి వెళ్లిపోయారు.

పోటీ చేసేది నేనే: కోడెల శివరామ్

రేపు రాబోయే రోజుల్లో పోటీ చేసేది నేనే అని టీడీపీ యువ నాయకుడు కోడెల శివరామ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరామ్ మాట్లాడుతూ ఎంత మంది వచ్చినా సరే ఎదుర్కొంటానన్నారు. నిలబడతానని, పోరాడతానని, కోడెల బిడ్డగా, మీలో ఒక్కడిగా మీతో పాటే నా జీవితమన్నారు. ఎందుకంటే కోడెల శివ ప్రసాదరావు కూర్చున్న కుర్చీలో కూర్చోవాలంటే దమ్ముండాల .. ధైర్యం ఉండాల .. గెలుపు ఉండాల ... పోరాటం ఉండాల .. అంటూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహణ

- జిల్లాలో 48 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 31,088 మంది విద్యార్థులు
- స్ట్రాంగ్ రూమ్‌లో ప్రశ్నపత్రాలు భద్రం
- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు



సత్తెనపల్లి వృంద మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సత్తెనపల్లి: విద్యార్థుల భవిష్యత్తుకు కీలకంగా నిలిచే ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షల సందడి ప్రారంభమైంది. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 20వ తేదీ నాటికి ముగిశాయి. మార్చి ఒకటి నుంచి 20 వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. నిఘా నీడలో పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 9 ప్రభుత్వ కళాశాలలు, 69 ప్రైవేట్ కళాశాలలు, 2 ఎయిడెడ్ కళాశాలలు, 6 సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఒకటి రెసిడెన్షియల్, 14 మోడల్ పాఠశాలలు, 24 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మూడు హైస్కూల్ ప్లస్ ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో 128 ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో పరీక్ష కేంద్రాలుగా 48 కళాశాలలను ఎంపిక చేశారు. జిల్లాలో 31,088 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 29,628 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,460 మంది ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 14,232 మంది, ఒకేషనల్ విద్యార్థులు 760 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,597 మంది, ఒకేషనల్ విద్యార్థులు 561 మంది ఉన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన 08647–223355 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. ఇప్పటికే ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లు ఆయా కళాశాలలకు చేరుకోగా విద్యార్థులకు అందజేశారు. హాల్ టికెట్లు నేరుగా విద్యార్థులే డౌన్‌లోడ్ చేసే సదుపాయాన్ని ఇంటర్ బోర్డు కల్పించింది. ప్రిన్సిపల్ సంతకం లేకుండానే డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్ సహాయంతో పరీక్ష రాయవచ్చు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్రాల ఎంపిక పూర్తయింది. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు. డీవో, ఇన్విజిలేటర్లతో సహా ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ వినియోగించడానికి వీల్లేదు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు, వెలుతురుతోపాటు ప్రథమ చికిత్స ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

– నీలావతిదేవి, డీఐఈఓ, పల్నాడు జిల్లా.

ఐవోసీఎల్ సహకారం అభినందనీయం

- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి
- జిల్లాలోని 120 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువులు అందజేసిన లిటిల్ ఫీట్స్
- ఆటవస్తువులు పంపిణీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, వేదికపై కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: పల్నాడు జిల్లా అభివృద్ధిలో 'లిటిల్ ఫీట్స్' సాయం ఎనలేనిదని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి.జయలక్ష్మి పేర్కొన్నారు. కనెక్ట్ ఆంధ్రా ప్రతినిధి ప్రసాద్ సహకారంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) అసిస్టెంట్ మేనేజర్ శ్రీరాములు 120 అంగన్‌వాడీ కేంద్రాలకు 'మిషన్ లిటిల్ ఫీట్స్' ఆట వస్తువులు విరాళంగా ప్రకటించారు. భువనచంద్ర టౌన్‌హాలులో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీలకు ఆయా వస్తువులను జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి స్కూలు పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు ఆట, పాటలను తిలకించారు. జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లల అభివృద్ధి కోసం తెప్పించిన ఈ వస్తువులతో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ విద్యావిధానంలో ఫౌండేషన్ కోర్సు మార్పు తెస్తుందన్నారు. బంగారు తల్లి ప్రోగ్రామ్‌కు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పిల్లలు శారీరక, మానసిక అభివృద్ధి చెందేందుకు కంటితో చూసే విధంగా జిల్లా కలెక్టర్‌పాటు పడుతున్నారని కితాబు ఇచ్చారు. వెనుకబడిన పల్నాడు జిల్లాలో ఐఓసీఎల్ అంగన్‌వాడీ అభివృద్ధికి పనిచేసే సంస్థగా ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ 120తోపాటు మరో 1200 కేంద్రాలకు ఐఓసీఎల్ సాయం చేయాలనే లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. కనెక్టింగ్ ఆంధ్ర, ఐఓసీఎల్ రెండూ కలిసి పల్నాడులోని పిల్లల అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ పీడీ ఉమారాణి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగులకు శిక్షణ

పట్టణంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ పుస్తకాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్‌హబ్ ఏర్పాటుచేసి వాటి ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. దీనిలో భాగంగా పట్టణంలో ఏర్పాటుచేసిన ఉచిత టైలరింగ్ ఎస్‌సీసీ సెంటర్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ రోజుల్లో మహిళలు ఉద్యోగ రంగంలోనే కాకుండా స్వయం ఉపాధి రంగంలో కుడా బాగా రాణిస్తున్నారని అన్నారు. ఉచిత టైలరింగ్ శిక్షణలో అందరూ క్రమశిక్షణతో నేర్చుకొని స్వయం ఉపాధి రంగంలో మంచి విజయాలు సాధించాలని కోరారు. డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కే.సంజీవరావు, నాక్ అదనపు డైరెక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాల్సిందే

నరసరావుపేట: బాలల హక్కుల పరిరక్షణ కోసం ఆయా ప్రభుత్వ శాఖలు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో 'బేటీ బచావో – బేటీ పడావో' అనే కార్యక్రమం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 'బేటి బచావో– బేటీ పడావో' అనుసంధానమై ఉన్న మహిళలతో వివిధ రకాల పథకాల గురించి వివరించారు. సమాజంలో ఒకరు లేదా ఇద్దరు చట్టంపై భయం లేకుండా వైవిధ్యమైన ఆలోచనలతో ఆడపిల్లపై చేసే అరాచకాలు మనం చూస్తున్నామన్నారు. ఇటువంటి సంఘటనలు మనకు మరకగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల్యవివాహాల నిరోధక చట్టం, దిశా యాక్ట్, యాప్, పోక్సో యాక్టివ్ వంటి చట్టాలు గ్రామస్థాయిలో ప్రజలందరికీ అవగాహన కలిగించాలన్నారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ పీడీ ఉమారాణి మాట్లాడుతూ మార్చి 8వ తేదీలోగా ఐసీడీఎస్ ప్రణాళిక తయారు చేసేందుకు కలెక్టర్ అవకాశం ఇచ్చారని తెలిపారు. జువైనల్, జస్టిస్ యాక్ట్ గురించి జువైనల్ జస్టిస్ బోర్డు మెంబర్ ఎం.శ్రీనివాస్ వివరించగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సీహెచ్.రాజకుమారి పోక్సో చట్టం, బాలల హక్కుల చట్టం గురించి వివరించారు. డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కె.సంజీవరావు, సర్వశిక్ష అభియాన్ అధికారి రేవతి, సీడీపీఓలు ఎం.అనురాధ, శ్రీలత, శ్రీవల్లి, శాంతకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీస్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

అర్చకోద్యమ పితామహుడు రామాచార్యులు

- తెనాలి బండ్‌పై రామాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, పక్కన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: తెనాలి ప్రాంత ఉన్నతికి కారకులైన మహానుభావుల విగ్రహాలతో తెనాలి బండ్ రూపకల్పన చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందనీయులని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఎవరు ఎంతగా ఎదిగినా మూలాలను మరచిపోరాదనేది తన భావనగా చెబుతూ అందుకు అనుగుణంగానే తెనాలిలో ప్రముఖుల విగ్రహాలతో తెనాలి బండ్‌ను ఏర్పాటుచే స్తున్నారని చెప్పారు. తన పదవీకాలంలో ఏం చేసినా చేయకున్నా తెనాలి బండ్ ఏర్పాటుతో ఎమ్మెల్యే శివకుమార్‌కు జీవితకాలం తృప్తి లభిస్తుందన్నారు. తెనాలి బండ్‌పై ప్రప్రథమంగా రామాచార్య స్మారక సమితిచే ప్రతిష్టించిన జాతీయవాది, అర్చకోద్యమ పితామహుడు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు తమిరిశ రామాచార్యులు కాంస్య విగ్రహాన్ని మంగళవారం త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. పుష్పాంజలి ఘటించారు. సభకు టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథ బాబు అధ్యక్షత వహించారు. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పూర్వం హైదరాబాద్ టాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలను ఎన్టీఆర్ ఏర్పాటు చేసినపుడు తనతో సహా చాలామంది విమర్శించారని గుర్తుచేశారు. ప్రజాదరణ చూసినపుడు ప్రజలకు తిండే కాదు...మిగిలినవి కూడా అవసరమని భావించానని చెప్పుకున్నారు. కాలేజీలో విద్యార్థి పరిషత్‌లో ఉన్నప్పట్నుంచి రామాచార్యులుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామాచార్యులు, తాము చేసిన కృషి ఫలితంగానే తర్వాతి ప్రభుత్వాలు అర్చకుల ఇబ్బందులపై దృష్టి పెట్టాయన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాలతోపాటు రాజకీయంగా చైతన్యవంతమైన తెనాలి ప్రాంతానికి కీర్తిని తీసు కొచ్చిన మహానుభావులు ఎందరో ఉన్నారని చెప్పారు. స్థానికుడినైన తాను వారి చరిత్రను నేటితరానికి, భావితరాలకు అందుబాటులోకి తీసుకురావాలని తెనాలి బండ్ ఏర్పాటుకు పూనుకున్నట్టు చెప్పారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు, రామాచార్య స్మారక సమితి అధ్యక్షుడు తమిరిశ అనంతాచార్యులు వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

అలా తప్పించడంలో ఆలపాటి బలి

- తెనాలిలో ఇదే మొదటిసారి కాదు
- గతంలో డాక్టర్ రావి, డాక్టర్ ఉమలకు ఇదే అనుభవం
- ఇప్పుడు ఆలపాటికీ అదే విలువ
- నిలువునా ముంచటం బాబు నైజం
- గుర్తు చేసుకుంటున్న స్థానికులు



ఆలపాటి రాజేంద్రప్రసాద్ డాక్టర్ గోగినేని ఉమ డాక్టర్ రావి రవీంద్రనాథ్

తెనాలి: పొత్తుల పేరుతో తెనాలి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు అప్పగించారు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు. సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఈసారి పోటీ చేసేందుకు సీటు లేకుండాపోయింది. ఈ పరిణామం ఆ పార్టీ వర్గాల్లో ముఖ్యంగా రాజా అనుయాయుల్లో ఆగ్రహాన్ని రేపింది. అత్యసవర సమావేశం ఏర్పాటుచేసి మూకుమ్మడి రాజీనామాలతో తాడోపేడో తేల్చుకుందామన్న వారి ఆగ్రహజ్వాలలను ఆలపాటి రాజానే ప్రస్తుతానికి అణిచి వేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు పార్టీ నేతలకు టికెట్ నిరాకరించటం ఇదే మొదటిసారి కాదనీ, నమ్మినవారిని నిలువునా ముంచటం ఆయన నైజమనీ స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

2009 ఎన్నికల్లో వేమూరు నుంచి నక్కా ఆనందబాబు, తెనాలి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పశ్చిమ స్థానం నుంచి చుక్కపల్లి రమేష్‌లు పోటీచేసిన విషయం తెలిసిందే. ఈ మూడు సీట్లకు అభ్యర్థిత్వాలను కట్టబెట్టేందుకు చంద్రబాబుకు భారీగా ముడుపులు ముట్టజెప్పారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ విధంగా వేమూరు నుంచి వచ్చిన ఆలపాటి రాజాకు తెనాలి టికెట్‌ను ఇచ్చేందుకు డాక్టర్ గోగినేని ఉమను పక్కనబెట్టారు. అప్పట్లో ఉమను తప్పించి టికెట్ తెచ్చుకున్న ఆలపాటి రాజాకు మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి ఎదురుకావటం చిత్రంకాదు...చంద్రబాబు నైజానికి మరో నిదర్శనం అంటున్నారు జనం. 1994 నుంచి ఎన్నికల్లో పోటీచేస్తూ వస్తున్న ఆలపాటి రాజా వరుసగా మూడుసార్లు వేమూరు నుంచి పోటీ చేశారు. అక్కడ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఒక పర్యాయం మంత్రిగా కూడా చేశారు. 2009, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా తెనాలి నుంచి పోటీచేస్తున్నారు. గత ఆరు ఎన్నికల్లో పోటీపడుతూ వచ్చిన ఆలపాటిని, 2024 ఎన్నికలకు జనసేన పార్టీతో పొత్తుల పేరుతో చంద్రబాబు దూరం పెట్టారు. అవసరమైతే ఎవరినైనా అక్కున చేర్చుకోవటం, వద్దనుకుంటే నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అనేది మరోసారి నిరూపణ అయిందంటూ తెనాలిలో చర్చలు నడుస్తున్నాయి.

ముచ్చటగా మూడోసారి

1994లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ రావి రవీంద్రనాథ్‌ను టీడీపీలో చేర్చుకుని, పార్టీ టికెట్ కట్టబెట్టారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో పోటీచేసిన డాక్టర్ రావి, సమీప కాంగ్రెస్ అభ్యర్థి, అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే నాదెండ్ల భాస్కరరావుపై పోటీచేశారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి కూడా రంగంలో ఉండటంతో ఆ ఎన్నికల్లో డాక్టర్ రావి గెలుపొందారు. 1999 ఎన్నికలు వచ్చేసరికి సీను మారిపోయింది. సిట్టింగ్ అభ్యర్థి డాక్టర్ రావి రవీంద్రనాథ్‌కు టికెట్ నిరాకరించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేత కొణిజేటి రోశయ్య పోటీ చేస్తున్నారన్న సాకుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక రాజకీయ ప్రముఖుడు ఆలపాటి వెంకట్రామయ్య మనుమరాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దొడ్డపనేని ఇందిర కుమార్తె డాక్టర్ గోగినేని ఉమను పార్టీలోకి తీసుకుని టికెట్ కట్టబెట్టారు. రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన డాక్టర్ రావి రవీంద్రనాథ్‌ను పక్కన బెట్టారు. 1999 ఎన్నికలలో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ ఉమ కొణిజేటి రోశయ్యపై విజయం సాధించారు. 2004లో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఓటమి చెందారు. నాదెండ్ల మనోహర్ ఆ ఎన్నికల్లో గెలిచారు. 2009 ఎన్నికలొచ్చేసరికి డాక్టర్ గోగినేని ఉమకు పార్టీ టికెట్ ఇవ్వలేదు. వేమూరు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వు కావటంతో అక్కడ పోటీచేస్తూ వచ్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు.

క్లుప్తంగా

ప్రభలకు అంతరాయం లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చే ప్రభల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి 8వ తేదీన కోటప్పకొండలో చేపట్టనున్న తిరునాళ్ల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. యల్లమంద వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రభల రాకపోకలు సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిలకలూరిపేట మేజర్ కేనాల్‌ను ఎన్ఎస్‌పీ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా నీటిని విడుదల చేయాలని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు కేనాల్‌పై ఏర్పాటుచేసిన ఇనుప బ్రిడ్జిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ రాజా నాయక్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో మంగళవారం ఏపీ టెట్–2024 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి మార్చి 9వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కోటప్పకొండరోడ్డు, ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కేసానుపల్లి, తిరుమల ఇంజినీరింగ్ కళాశాల గుంటూరు రోడ్డు కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నారు. తొలిరోజు మూడు సెంటర్లలో మాత్రమే టెట్ పరీక్ష నిర్వహించగా, 304 మంది అభ్యర్థులకు గాను 274 మంది హాజరయ్యారు. మరో 30 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు నేతృత్వంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ ఆయా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

నరసరావుపేట ఈస్ట్: పోలియో మహమ్మారిని సమూలంగా రూపుమాపేందుకు చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్చి 3వ తేదీన పల్స్‌పోలియోను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

దర్జీకి సంక్షేమ దర్జా



సత్తెనపల్లిలో కుట్టు పనిలో ఉన్న టైలర్లు

దుస్తులతో మనిషికి అందం, హుందాతనం. వస్త్రానికి మంచి ఆకృతినిచ్చి వాటిని అందించే కళాత్మక సైనికులు దర్జీలు. అయితే పలు ఫ్యాషన్లు.. డిజైన్లతో రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరలకు మార్కెట్లోకి అందుబాటులోకి రావడంతో వారి కష్టానికి 'ఫలితం' తగ్గిపోయింది. ఐదేళ్ల ముందు పాదయాత్రలో దర్జీల కష్టాలను విన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి 'చేదోడు' ఇచ్చారు. జీవితాల్లో వెలుగులు నింపారు.

- దర్జీలకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం
- జగనన్న చేదోడు పథకం టైలర్లకు వరం
- సీఎం వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు
- నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే దర్జీల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించింది. 2021 నుంచి జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన దర్జీల ఖాతాలో ఏడాదికి రూ.10 వేల వంతున సర్కార్ జమ చేస్తోంది. నాడు దర్జీ వృత్తి వదిలి ఇతర పనులకు వెళ్లిన వారందరూ మళ్లీ కుట్టు పనులు చేసుకుని, హాయిగా జీవనం సాగిస్తున్నారు. పథకం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఆ ఆలోచన వైఎస్సార్‌దే..

దర్జీల జీవితాల్లో వెలుగులు ప్రసాదించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 మార్చి 1న జీవో నంబరు 86 విడుదల చేశారు. చెన్నై, కేరళ ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలో కూడా దర్జీలకు సదుపాయాలు కల్పించాలని ఆకాంక్షించారు. 2009 మే 14న ఆంధ్రప్రదేశ్ దర్జీలను కో–ఆపరేషన్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించారు. దీంతో రాష్ట్రంలోని దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందని తలచి, వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీవో జారీ చేసిన తర్వాత కోటి రూపాయలు నిధులు కూడా కేటాయించారు. అయితే వైఎస్సార్ మరణానంతరం ప్రభుత్వాలు చేనేత జౌళి శాఖకు నిధులు కేటాయించక పోవడంతో దర్జీల పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. జగనన్న చేదోడు పథకం ద్వారా దర్జీల ఖాతాల్లో రూ.10 వేలు ఏటా జమచేస్తూ వస్తున్నారు.

పల్నాడు జిల్లాలో జగనన్న చేదోడు లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
2020-21	4,884	4.88
2021-22	7,390	7.39
2022-23	9,207	9.21
2023-24	9,400	9.40
మొత్తం	30,881	30.88

అర్హులందరికీ జగనన్న చేదోడు

కష్టాల్లో ఉన్న టైలర్లను ఆదుకోవడానికి జగనన్న చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తోంది. అర్హులందరికీ జగనన్న చేదోడు పథకం ప్రభుత్వం వర్తింపజేసింది.

–షేక్ జానీ, టైలర్, సత్తెనపల్లి



టైలర్లకు ఎంతో ఉపయోగకరం

మార్కెట్లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్లకు పని తగ్గింది. కుటుంబ పోషణ కష్టమవుతోంది. దీనిని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ టైలర్లకు చేదోడు సాయం ప్రకటించారు. ఏటా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందిస్తూ.. కొంత ఉపశమనం కల్పిస్తున్నారు.

–స్వప్నరెడ్డి, టైలర్, సత్తెనపల్లి.



విద్యుదాఘాతంతో బాలుడి మృతి



షేక్ అబుబకర్

చిలకలూరిపేట టౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన షేక్ అబుబకర్(11) పట్టణంలోని వడ్డెర కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఉదయం బాలుడి తల్లి మంచినీరు పట్టి పనికి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ వైర్లతో ఆడుకుంటున్న అబుబకర్ వైర్ల మధ్య ఉన్న జాయింట్ నీటిలో పడి ఉండటం గమనించలేదు. విద్యుత్ ప్రసరించటంతో బాలుడు షాక్‌కు గురై మృతి చెందాడు. గమనించి బాలుడి అక్క షేక్ హప్సా మెయిన్ ఆఫ్‌చేసి రక్షించే ప్రయత్నం చేసింది. సమీపంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు సాయాన్ని పార్టీ నాయకుల ద్వారా అందించారు.

చిన్న ఆలోచన నుంచే గొప్ప ఆవిష్కరణలు

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు



ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య నుంచే విద్యార్థులు సృజనాత్మకతను అలవరుచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లా స్థాయి ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లాలోని పది పాఠశాలల నుంచి విద్యార్థులు ఎక్స్‌పోలో తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎక్స్‌పోను ప్రారంభించిన డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైజ్ఞానిక రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ సామాజిక అవసరాలకు ఉపయోగపడే నూతన వస్తు సేవలపై ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గొప్ప ఆవిష్కరణలు సైతం చిన్న ఆలోచనల నుంచే ఆవిర్భవిస్తాయని తెలిపారు. ఎక్స్‌పోలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల (అమరావతి) విద్యార్థుల ఆయుర్వేద వైద్య చిట్కాలు ప్రథమ, జెడ్పీ హైస్కూల్ (తూబాడు) విద్యార్థుల కుట్టు, అల్లికలు ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతులు లభించాయి. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్ తెలిపారు. ఎంపిక జ్యూరీ కమిటీ సభ్యులుగా కె.చిట్టెమ్మ, ఒ.సాంబయ్య, మధుకుమార్ వ్యవహరించారు. విజేతలకు డీఈఓ వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీహెచ్ రఘురామ్, కె.నాగపావని, డి.లక్ష్మి, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సరిపడా విత్తనాలు అందజేయాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కుర్రిసాయి మార్కొండారెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మార్కొండారెడ్డి

నరసరావుపేట: రాబోయే ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన విత్తనాలు అంచనా వేసి రైతులకు ఆర్‌బీకేల ద్వారా సకాలంలో సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ రబీలో సాగుచేసిన వివిధరకాల పంటల విస్తీర్ణం ఈ–పంటలో నమోదు చేసినట్లు చెప్పారు. రైతుల ఈ–కేవైసీ కూడా పూర్తిచేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించిన 48 ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా 455 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా శనగ పంట కొనుగోలు ప్రారంభిస్తున్నామన్నారు. డీఆర్వో కె.వినాయకం మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన విషయాలు ఆర్‌బీకేల ద్వారా రైతులకు చేరాలన్నారు. నానో యూరియా, డీఏపీలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐబీ విధానంతో విద్యార్థి సమగ్రాభివృద్ధి

డైట్‌ను సందర్శించిన ఐబీ బృందం



డైట్ కళాశాలలో బోధన పద్ధతులపై ఆరా తీస్తున్న ఐబీ బృందం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయస్థాయి విద్య, విద్యార్థులు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటర్నేషనల్ బాకలారియట్(ఐబీ)తో చేసుకున్న ఒప్పందం కార్యాచరణకు దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఐబీ విద్యా విధానం అమలుకు అవసరమయ్యే సదుపాయాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ కేంద్రాన్ని ఐబీ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. డైట్ కళాశాలకు విచ్చేసిన ఐబీ బృంద సభ్యులు కరిక్యూలం స్పెషలిస్ట్ డాక్టర్ అలెన్(ఇంగ్లాండ్), పోస్ట్ ఆథరైజేషన్ పాలసీ అండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీ గ్రీన్(అమెరికా), ఈక్విటీ అండ్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కళా పరుశురామ్‌లకు సాదరంగా ఆహ్వానించారు. తొలుత డైట్ కళాశాలలోని సైన్స్, మ్యాథ్స్ తదితర ల్యాబ్‌లను సందర్శించి విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకించారు. ఆయా ప్రయోగాల తయారీపై నెలకొన్న ఆసక్తి, ప్రేరణ, ప్రయోగ ఫలితాలు, వాటి ప్రయోజనాల గురించి విద్యార్థులు వివరించారు. విద్యార్థుల పనితీరు, యాక్షన్, పరిశోధన ఫలితాలను పరిశీలించారు. వారి నిర్వహించే కార్యక్రమాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాల అంచనాలపై ఆరా తీశారు. ప్రస్తుతం డైట్ కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన విధానం, ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. అనంతరం దశల వారీగా ఐబీపై అవగాహన నైపుణ్యం, సామర్థ్యం పెంపుపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై విషయాలను పరిశీలనకు వచ్చినట్లు బృందం తెలిపింది. బోధనలో సబ్జెక్టుల విభజన కాకుండా బహుళ బోధన విధానం అవలంబించడమే ఐబీ ప్రత్యేకత అని స్పష్టం చేసింది. ఆధునిక, సాంకేతికతను జోడించి ఏకకాలంలో విద్యార్థుల అభిరుచుల్ని అనుగుణంగా బోధన పద్ధతుల్లో మార్పు తెస్తున్నట్లు చెప్పారు. ఇందుకు గురువులు కూడా తమ వృత్తిపరమైన నైపుణ్యాల్ని పెంపొందించుకుని అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. ఐబీ, ఎస్‌సీఈఆర్‌టీ లు సమన్వయంతో అందించే ఈ నవీన విద్యాబోధన తీరును క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చేరేలా చేసినప్పుడే విద్యార్థి సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేయగలమన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను సందర్శించిన కాయకల్ప బృందం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలను నేషనల్ హెల్త్ మిషన్ నుంచి ఇద్దరు వైద్యులు మంగళవారం సందర్శించారు. క్వాలిటీ కంట్రోల్, కాయకల్ప పరిశీలించారు. యూనిసెఫ్ క్వాలిటీ మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ విక్రమ్‌రెడ్డి, స్టేట్ క్వాలిటీ మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్ పల్ల వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలు, వైద్య విధానం గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు వివిధ వార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో వైద్యశాలలను తాము పరిశీలించామని, కానీ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల మాత్రం ప్రత్యేకంగా ఉందన్నారు. చాలా మంచి సేవలు అందుతున్నాయని చెప్పారు. పై అంతస్తు నిర్మాణం పూర్తయిన తర్వాత మరలా ఒకసారి తనిఖీ కోసం వస్తామని, ఇక్కడ డెలివరీలు బాగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ నేషనల్ సర్టిఫికేషన్ అయినా లక్ష్య, ముస్కాన్ అవార్డును దక్కించుకున్నామని, కాయకల్ప టీం కూడా అవార్డు అందిస్తారని ఆశా భావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాయకల్ప టీమ్‌ని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు ఉన్నారు.